క్లుప్తంగా

పేదలకు భూ పట్టాల పంపిణీ



భూ పట్టాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి

నందవరం: మండలంలోని కనకవీడు, కె.పేటకు చెందిన పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన భూపట్టాలను బుధవారం పంపిణీ చేశా రు. కనకవీడు సచివాలయ భవనంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కనకవీడులో 28 మంది, కె.పేటలో 7 మందికి భూ హక్కు పత్రాలు ఇచ్చారు. లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయని గుర్తుచేశారు. సర్పంచులు వెంకట్రాముడు, ఉదయ్ గౌడ్, వీఆర్వో భరత్ ఉన్నారు.


వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



హొళగుందలో సన్మానం అందుకున్న వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా ఉంటూ గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలను వెలకట్టలేమని ఎంపీడీఓ ఆజాద్, తహసీల్దారు ప్రసాద్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బుధవారం హొళగుందలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, ఎంపీటీసీలు మల్లికార్జున, శివన్న, హనుమప్ప, దగ్గన్న, సోమప్ప, జయన్న తదితరులతో కలిసి సేవారత్న, సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందించారు. వారు మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలను గుర్తించి వారికి ప్రోత్సాహకాలు ఇచ్చి సత్కరించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం వలంటీర్లను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్, పంచాయతీ సెక్రటరీలు రాజశేఖర్, రంగస్వామి, ఆర్‌ఐ దినోజ్ పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే అమ్మోరు మద్దమ్మ




మద్దమ్మ మూల విరాట్

మద్దికెర: తనను కొలిచే భక్తులను అక్కున చేర్చుకుంటూ వారి కోరికలను నెరవేర్చుతూ అమ్మోరు తల్లి మద్దమ్మగా భాసిల్లుతున్న మాధవీ దేవత (మద్దమాంబ) జాతర ఉత్సవాలను ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 23న రాత్రి 9 గంటలకు లగ్నోత్సవం, 10:20 గంటలకు మాంగల్యధారణ జరుగుతుంది. 24న సాయంత్రం 4 గంటలకు రథం ముందు హోమం , 5:45కు అశేష జనవాహిని మధ్య అమ్మ వారి రథోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 25న పారువేటతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రంలోనే పెద్ద చెక్క విగ్రహం

6 శతాబ్దాల క్రితం మద్దికెరలో వెలసిన మద్దమ్మ దేవత విగ్రహంలో జీవకళ ఉట్టి పడుతుంది. ఇంత పెద్ద విగ్రహం రాష్ట్రంలో మరెక్కడా లేదనేది. ప్రతీతి. అక్కడున్న మద్ది వృక్షాన్నే విగ్రహంగా చెక్కినట్లు శిలా శాసనాలు చెబుతున్నాయి. దేవత పేరుతోనే మద్దికెరను, మద్దమ్మ కుంటను, మద్దమ్మ బావిని ఏర్పాటు చేశారు. గ్రామంలో చాలా మందికి మద్దమ్మ, మద్దికెరప్ప, మద్దన్న వంటి పేర్లు పెట్టుకుంటుంటారు.

దొంగకు దేహశుద్ధి



దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామం చాకలి వీధిలో నివసిస్తున్న వీరేష్ ఇంట్లోకి బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి చొరబడి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువా తెరిచేందుకు ప్రయత్నించాడు. అంతలోపే వీరేష్ ఇంట్లోకి రాగ గమనించిన దొంగ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. వీధి ప్రజలు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

పండ్లతోటల సాగుపై అవగాహన

ఆలూరు: రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఆలూరు క్లస్టర్ ఏపీడీ పి.పద్మావతి సూచించారు. హాలహర్వి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పండ్ల తోటలను ఆమె బుధవారం పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ.. నీటి సౌకర్యం కలిగిన సన్న, చిన్నకారు రైతులు ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల తోటల సాగు చేపడితే ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని వివరించారు. హార్టికల్చర్ ద్వారా డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. ఏపీడీ హేమచంద్ర, ఈసీలు, తదితరులు ఉన్నారు.

అల్లర్లు సృష్టిస్తే జైలుకే..

ఆలూరు: గ్రామాల్లో ఎలాంటి గొడవలు, ఘర్షణలు చేసుకోకుండా ప్రశాంతంగా జీవించాలని హాలహర్వి ఎస్‌ఐ నరేంద్ర రౌడీషీటర్లకు సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు, ఇతర శాఖల అధికారులు గట్టి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి గొడవలు, అల్లర్లు సృష్టిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

లబ్ధిదారులే జగనన్నకు స్టార్ క్యాంపెయినర్లు



జొన్నగిరిలో డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



హాజరైన డ్వాక్రా మహిళలు

తుగ్గలి: సంక్షేమ పథకాల లబ్ధిదారులే జగనన్నకు స్టార్ క్యాంపెయినర్లని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. జొన్నగిరిలో 673 సంఘాల్లోని 6914 మందికి ఆసరా పథకం నాలుగో విడత కింద మంజూరు చేసిన రూ.3.82 కోట్ల మెగా చెక్కును బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంభనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు సంస్కరణలు చేపట్టారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు ఆగకుండా ప్రజలకు అందించారన్నారు. ఆసరా పథకం ద్వారా పూర్తిగా రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలుపుకున్నారని కొనియాడారు. తమ ప్రభుత్వంలో అన్ని పథకాల లబ్ధిని నేరుగా మహిళల ఖతాలకు జమచేయడం జరుగుతోందని చెప్పారు. ఏనాడూ ఇచ్చిన మాటను నిలుపుకోని చంద్రబాబును నమ్మితే మళ్లీ మోసపోవాల్సిందేనన్నారు. రుణమాఫీతో రైతులను, డ్వాక్రా మహిళలను మోసం చేసిన బాబును ఇంకా ఎవరూ మర్చి పోలేదన్నారు. ఓట్ల కోసం మాయమాటలతో వస్తున్న చంద్రబాబును, ఆయన దగాకోరు ముఠాను ఎవరూ నమ్మవద్దని కోరారు. పేదలకు 125 సార్లు బటన్ నొక్కి సాయమందించిన జగనన్న కోసం వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఒకటి, ఎంపీకి మరొకటి ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని పిలుపునిచ్చారు. మరోసారి జగనన్నకు అవకాశం ఇస్తే మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి సొంత అన్నలా తోడుంటారన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న జి.ఎర్రగుడికి చెందిన వడ్డె రాజేశ్వరిని ఎమ్మెల్యే పూలమాలతో సన్మానించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఎం రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయలక్ష్మి, గుంత దేవి, నాగేష్, పులికొండనాయక్, నాగప్ప, రఘు, తేరప్ప, కమాల్ బాషా, హనుమంతు, మోహన్‌రెడ్డి, టీఎండీ హుసేన్, నాగభూషణరెడ్డి, సుంకప్ప, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



ఆసరా పథకం ద్వారా నేతాజీ గ్రూపులో ఉన్న పది మందికి నాలుగు విడతల్లో రూ.4.30 లక్షలు మాఫీ అయింది. నాకు ఒక్కో విడతలో రూ.10,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.43 వేలు మాఫీ అయింది. ఈ సొమ్ముతో ఏడాదికి రెండుసార్లు పది పొట్టేళ్లు కొనుక్కొని మేపుకొని అమ్ముకుంటా. ఏటా లక్ష రూపాయల దాకా ఆదాయం పొందుతున్నా. ఇంతకంటే ఏం కావాలి. చెప్పిన మాట ప్రకారం పొదుపు అప్పు మాఫీ చేసిన జగన్‌నన్నకు రుణపడి ఉంటాం. – హజరాబీ, డ్వాక్రా సభ్యురాలు, చెన్నంపల్లి

మళ్లీ జగనన్నే రావాలి



గతంలో ఎన్నడూ ఇలాంటి పథకాలు చూడలేదు. పొదుపు సంఘంలో ఉన్న నాకు ఒక్కో విడతలో రూ.12,500 చొప్పున నాలుగు విడతల్లో రూ.50 వేలు మాఫీ అయింది. సంక్షేమ పథకాలతో వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని ఇబ్బంది లేకుండా పోషించుకుంటున్నాం. ప్రతి పథకంలో జగనన్న మహిళలకు పెద్దపీట వేస్తున్నారు. పేదలకు ఎంతో మేలు చేసిన జగనన్నే మళ్లీ సీఎంగా రావాలి. – శాంతమ్మ, డ్వాక్రా సభ్యురాలు, ఉప్పర్లపల్లి

ఆస్పత్రికి బుట్టా ఫౌండేషన్ విరాళం



ఫ్యాన్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి బుట్టా ఫౌండేషన్ ద్వారా 21 ఫ్యాన్లు, బెడ్‌షీట్లను బుధవారం విరాళంగా అందించారు. వివరాలు.. ఈ నెల 13వ తేదీన మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక ఆస్పత్రిని సందర్శించారు. వార్డులను పరిశీలించి సమస్యలపై రోగులను ఆరా తీశారు. వారి సూచనల మేరకు బుధవారం బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక చేతుల మీదుగా ఆస్పత్రికి 21 ఫ్యాన్లు, బెడ్‌షీట్లను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిగా పూర్తి చేయాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

సమన్వయకర్త బుట్టా రేణుక మాట్లాడుతూ.. బుట్టా ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి మెడికల్ కాలేజీల నిర్మాణం, ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించారని గుర్తుచేశారు. సొసైటీ ఫర్ ఏపీ నెట్వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్, హెచ్‌డీసీ మెంబర్ రియాజ్, నాయకులు బుట్టా రంగయ్య, సునీల్‌కుమార్, బుట్టా నీలకంఠ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): విధి వక్రీకరించిన వారి కుటుంబాలకు స్వాంతన చేకూర్చేలా, ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని వ్యాధుల బారిన పడి చికిత్స పొందిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె తన స్వగ్రామం చెరుకులపాడులోని ఇంట్లో పత్తికొండ, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కరెంట్ షాక్‌తో మృతి చెందిన కృష్ణగిరి మండలం బాపనదొడ్డి బోయ శేషాద్రి భార్యకు రూ.2 లక్షలు, గుండెపోటుతో మరణించిన కోయిలకొండ మాదిగ చిన్న రంగడు భార్యకు రూ.3 లక్షలు, డోన్ హైవే రోడ్డులో ప్రమాదంలో చనిపోయిన బొంతిరాళ్ల హరిజన రంగస్వామి భార్యకు రూ.2 లక్షలు, వెల్దుర్తి మండలం కృష్ణాపురంలో వినాయక నిమజ్జనం వద్ద కుంటలో పడి చనిపోయిన గొల్లరాజు తల్లికి రూ.2 లక్షలు, పత్తికొండకు చెందిన షఫికి రూ.90 వేలు, మహబూబ్‌బాషాకు రూ.85 వేల చెక్కులను అందించారు. తమకు సాయం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణగిరి ఎంపీపీ, జెడ్పీటీసీలు డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, కేశ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమన్వయకర్త బుట్టా రేణుకను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో 300 మందికిపైగా మైనారిటీలు, తదితరులు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆమెకు క్రేన్ ద్వారా గజమాల వేసి సత్కరించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆలూరు రూరల్: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా క్రీడాపోటీలకు హత్తిబెళగల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 18వ తేదీన కర్నూలులో జరిగిన సెపక్‌తక్రా సబ్ జూనియర్ బాలుర క్రీడా పోటీల విభాగంలో రియాజ్, వరుణ్, శేషు బాలికల విభాగంలో మానస, హలీమ, నూర్జహాన్ ఎంపికైనట్లు వెల్లడించారు. వారు ఈ నెల 24, 25 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): పచ్చటి కొండలు, పారే సెలయేళ్లు, నెమళ్ల అరుపులు, వన్యప్రాణులు కేరింతలతో తులతూగుతుండే వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం, బేతంచెర్ల మండలం రంగాపురం మధ్య గల చిన్నమల్కాపురం ఫారెస్ట్ బీట్‌లో కొండల్లో వెలసిన పాలుట్ల రంగస్వామి ఆలయ సమీపంలో అలనాటి పాలెగాళ్ల నివాస ప్రాంతం కోటపేటలో ఓ సామాన్య భక్తుడు వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కాశిరెడ్డినాయన స్ఫూర్తితో ఏర్పాటు చేసిన చిన్న ఆశ్రమం ఇప్పుడు ఎందరికో కడుపు నింపుతోంది. ఆశ్రమానికి అనుబంధంగా భక్తుల విరాళాలతో నిర్మించిన కాశిరెడ్డి నాయన ఆలయంలో నేటి నుంచి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.

కోటపేట ఆంజనేయస్వామి, అవధూత కాశిరెడ్డి నాయన 14వ ఆరాధనోత్సవాలు, అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి, శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి, నవగ్రహ, నాగదేవతల 5వ వార్షికోత్సవం ఈనెల 22 వ తేదీన గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు కాశిరెడ్డినాయన ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీరంగాపురం రామచంద్రారెడ్డి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా గణపతి పూజ, పల్లకీ సేవ, ప్రత్యేక సేవలు, నందికోల సేవ, జ్యోతిజ్వాల, అన్నదాన కార్యక్రమాలున్నాయన్నారు. చెక్కభజన, కట్టి కోలన్న, పంచమాంకములు నాటక ప్రదర్శన ఉన్నాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు బండలాగుడు, గుండు ఎత్తు పందేలు

ఫిబ్రవరి 22న కొండపైన కోటపేట ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు, గుండు ఎత్తు పందేలు నిర్వహించనున్నట్లు శ్రీరంగాపురం గ్రామస్తులు తెలిపారు. బండలాగు పందెం వృషభాల విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.11 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నామన్నారు. గుండు ఎత్తు పందెం విజేతలకు వెండి పతకాలు అందించనున్నామన్నారు. పాల్గొనదలచిన వారు 80081 88087, 99483 24919 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి బుధవారం రాత్రి టీబీ బోర్డు అధికారులు నీటి సరఫరాను నిలిపి వేశారు. జలాశయంలో నీటి మట్టం అడుగంటుతుండడం, గతంలో నిర్ణయించిన మేరకు డ్యాంలోని ఎల్లెల్సీ హెడ్‌లో అర్ధరాత్రి నుంచి నీటిమట్టాన్ని తగ్గిస్తూ గురువారం ఉదయానికి పూర్తిగా సరఫరా బంద్ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ఆంధ్ర పరిధిలో నాలుగు రోజుల పాటు కాలువలో ప్రవాహం ఉంటుందని అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 1586.17 అడుగులతో 7.269 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోనున్నారు. మే నెలలో 10 రోజుల పాటు తాగునీటి అవసరాలకు కాలువకు నీటిని వదిలే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

చింతకుంటకు చేరిన నీరు

ఆలూరు: తుంగభద్ర డ్యాం అధికారులు తాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీ కాలువకు విడుదల చేసిన నీరు బుధవారం చింతకుంట వరకు చేరాయి. కేవలం తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని విడుదల చేశారని, రైతులు జలచౌర్యం చేయరాదని అధికారులు సూచించారు.

బాలికకు వేధింపులు

కృష్ణగిరి: మండల కేంద్రంలో ఓ బాలికను ప్రేమ పేరిట వేధిస్తున్న ఇదే గ్రామానికి చెందిన శివపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న బాలిక ఇంట్లోకి వెళ్లి ప్రేమించాలని ఒత్తిడి చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ చెప్పారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి

కృష్ణగిరి: లాల్‌స్వామి ఉరుసును ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ నెల 23 నుంచి ఉరుసు వేడుకల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని పాత బోదెపాడు గ్రామంలోని పంట పొలాల్లో దాచిన కర్ణాటక మద్యంను సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో గోనెగండ్ల పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. బోదెపాడు గ్రామానికి చెందిన బోయ మహేష్ కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యాన్ని అక్రమంగా తెచ్చుకొని బోదెపాడు గ్రామ సమీపం పంట పొలంలో దాచి ఉంచాడు. దీనిపై అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం సిబ్బందితో వెళ్లి దాడులు చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో 6 బాక్సుల్లో 540 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను (90ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

మద్దికెర: నాటుసారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. మండలంలో గత రెండు రోజులుగా సిబ్బందితో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి దాదాపు 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని, అలాగే 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా సారా తయారీ మానుకోవాలని లేదంటే కేసులు నమోదు చేయడమే గాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడిగిన వారందరికీ పనులు కల్పించండి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో కూలీలు వలసలు వెళ్లకుండా పనులు కల్పించేందుకు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఓ శేషిరెడ్డి, ఈసీ చెన్నకేశవులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

కాలువలో పడి పూజారి మృతి

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి వచ్చిన పూజారి నీటమునిగి మృత్యువాత పడ్డాడు. కర్నూలుకు చెందిన పూజారి జశ్వంత్ (25) బృందం బుధవారం గుండ్లకొండలో ఉత్సవం జరిపించేందుకు వచ్చారు. ఉదయం గ్రామ సమీపంలోని హంద్రీ–నీవా కాలువలో స్నానం చేసేందుకు దిగగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడ్డారు. జశ్వంత్‌కు ఈత రాకపోవడంతో కాలువలో మునిగిపోయాడు. మిగతా పూజారులు బయటికి తీసేలోపు జశ్వంత్ ప్రాణాలు కోల్పోయాడు. ఉత్సవం రోజున పూజారి మృత్యువాత పడడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

పానీపూరి విక్రేత ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): డోన్‌లో ఉంటూ డోన్, వెల్దుర్తి, ఇతర ప్రాంతాల్లో తోపుడు బండిపై పానీపూరి అమ్ముకునే బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై వెల్దుర్తి ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోవర్ధనగిరి సమీపంలో రైతు ఈశ్వరరెడ్డికి చెందిన తోటలో బుధవారం ఉదయం మామిడి చెట్టుకు తాడుతో ఉరివేసుకున్న స్థితిలో 13 ఏళ్ల బాలుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నసీంగా గుర్తించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు మండల సమావేశం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల సర్వసభ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మన సరళారవిరెడ్డి ఆధ్వర్యంలోగురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

26న వాలీబాల్ పోటీలు

ఆస్పరి: ములుగుందం గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఏఐవైఎఫ్, గ్రామ యూత్ ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు నగదు అందించనునున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు గురువారం ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ 62819 71243 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బి.విరూపాక్షి

దేవనకొండ: మండలంలోని వరిముక్కల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బుధవారం ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బి.విరూపాక్షి వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న పేద ప్రజలకు అందించే పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీలోకి చేరిన వారిలో నాయకులు లింగన్న,తేజ, కృష్ణ, సత్యనారాయణతదితరులు ఉన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని వరిముక్కల, కరిడికొండ, తిప్పతలమరి, బైరవాణికుంట గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మమేకమవుతూ ఊరి సమస్యల గురించి తెలుసుకుంటూ ముందుకుసాగారు. సీఎం జగనన్న చేసిన మేలును గుర్తు చేస్తూ సంక్షేమం అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు తపాల శ్రీను, అలారుదిన్నె ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజశేఖర్, సిద్ధం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రారాజు సీఎం వైఎస్ జగన్



కడిమెట్లలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ పథకాలు అమలులో రారాజుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగొందుతున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో నాడు–నేడు కింద నూతనంగా నిర్మించిన పాఠశాల అదనపు గదులు, హెల్త్ క్లినిక్, సచివాయలం, కడిమెట్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకొని ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాడని చెప్పారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, దుస్తులతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకు చేరుతున్నాయని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ మారెప్ప, డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, పీఆర్ డీఈ చంద్రశేకర్, ఎంపీడీవో కొండన్న, ఏఓ మహేశ్వరరెడ్డి, ఎంఈఓ–2 మధుసుధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి



సురేంద్ర (ఫైల్)

దేవనకొండ: మండలంలోని బేతపల్లి గ్రామానికి చెందిన బోయ సురేంద్ర (31) పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. వివరాలు.. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సురేంద్ర పొలం పనులకు వెళ్లాడు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వస్తుండడంతో పరిశీలించేందుకు దగ్గరకు వెళ్లగా స్టే వైరు తగిలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. సమీపంలోని వారు వెళ్లి చూడగా అప్పటికే సురేంద్ర మృతిచెందినట్లు తండ్రి బోయ మల్లికార్జున తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విజేత యనకండ్ల వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్యస్వామి ఉరుసు సందర్భంగా బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల సైజు వృషభాల బండలాగుడు పోటీల్లో యనకండ్ల వృషభాలు గెలుపొందాయి. పోటీలను వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. 15 జతల వృషభాలు పాల్గొనగా సి.బెళగల్ మండలం, యనకండ్ల తిరుమలేష్, మిట్టసోమాపురం వీరస్వామికి చెందిన ఉమ్మడి జత వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో నంద్యాల జిల్లా డోన్ మండలం, కొచ్చెర్వు చిక్కడు బుల్స్, కొత్తకోట డాక్టర్ గురునాథ్ వృషభాలు, ఓబులదేవురపల్లి అంజనేయులు వృషభాలు, పీఆర్ పల్లె బాష్యం నాగేశ్వరయాదవ్, పందికోన లవకుమార్, శ్రీరంగాపురం వినయ్‌కుమార్ వృషభాలు నిలిచినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వృషభాల యజమానులకు దాతలసాయంతో వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలను కమిటీ సభ్యులు అందజేశారు.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మి కొలుట్ల చెన్నకేశవస్వామి వారి కల్యాణం బుధవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి, చంద్రకళ దంపతులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తువ్వదొడ్డి ప్రేమనాథరెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. మంత్రాలయం వైఎస్సార్‌సీపీ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ వై.గిరిజమ్మ, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సతీమణి, వివిధ గ్రామాల సర్పంచులు, శివస్వాములు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న పి.కోటకొండకు చెందిన చల్లా బాలమురళీస్వామి మహారాజగోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందించారు. ఈఓ బి.చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.